క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

పాల్వంచరూరల్‌: ఎమ్మెల్యే కూనంనేని బుధవారం మండలంలో పర్యటించనున్నారు. కారెగట్టు, మొండికట్ట, రెడ్డిగూడెం, పాండురంగాపురం, సూరారం, సోములగూడెం, తవిశలగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పథకాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్లు మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు తెలిపారు.

విద్యుత్‌ శాఖ ఉద్యోగుల సెల్‌నంబర్ల మార్పు

ఇల్లెందురూరల్‌: విద్యుత్తు శాఖలో అధికారులు, సిబ్బందికి నూతన సెల్‌ నంబర్లు కేటాయించబడ్డాయి. ఇల్లెందు సబ్‌డివిజన్‌ పరిధిలో అధికారులకు కేటాయించిన సెల్‌నంబర్లు. ఏడీఈ – 8712485923, ఏఈ ఇల్లెందు టౌన్‌ 8712485924, ఏఈ రూరల్‌ 8712485932, ఏఈ గుండాల 8712485941, ఏఓ ఇల్లెందు 8712485948.

ఆర్టీసీ జీపుజాతా

ఇల్లెందు: ఈ నెల 21,22 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న ఆర్టీసీ స్టాఫ్‌ అండ్‌ ఫెడరేషన్‌ మహాసభలను విజయవంతం చేయాలని ఇల్లెందులో ఆ సంఘం జీపుజాతా ప్రచారం నిర్వహించింది. మంగళవారం బస్సు డిపో ఎదుట జరిగిన ప్రచార సభలో వాల్‌ పోస్టర్లు ఆవిష్కరించారు. సంఘం నాయకులు జే.నాగేశ్వరరావు, తోకల బాబు మాట్లాడుతూ... ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు. నబీ, కృష్ణ, నాగరాజు, అంజయ్య, నసీరుద్దీన్‌, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామసభలు

పాల్వంచరూరల్‌: గిరిజనులు అధికంగా నివాసం ఉంటున్న గ్రామాల్లో ఈనెల 15 నుంచి 30 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గంగాదేవిపల్లి, వెంగమ్మగుంపు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామసభలో ఆధార్‌కార్డు, ఆయూష్మాన్‌ భారత్‌ కార్డు, జన్‌ధన్‌ అకౌంట్లు, ఓటరు గుర్తింపు కార్డు, ఎఫ్‌ఆర్‌ఓ పట్టాలు, రేషన్‌ కార్డులు, ఉపాధి హామీ జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేకాధికారి రమణ, కార్యదర్శి నరేష్‌, ఆర్‌ఐ.అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఉచిత వైద్యపరీక్షలు

పాల్వంచరూరల్‌: మారుమూల అటవీ ప్రాంతం గొత్తికోయ గిరిజనులు నివాసం ఉంటున్న రాళ్లచెలక గ్రామంలో మంగళవారం ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి భాస్కర్‌ నాయక్‌, ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ తేజస్విని ఆదేశాల మేరకు గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి 112 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ జీతూరాం తెలిపారు.

డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్‌: రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌ పాషా, మైనారిటీ గురుకులాల కార్యదర్శి బి.షఫీవుల్లాను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. స్పందించిన ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

జీతాలు ఇవ్వండి..

జూలూరుపాడు: గ్రామపంచాయతీ కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. రెండు నెలల పెండింగ్‌ జీతాలను చెల్లించాలని కోరుతూ మంగళవారం యూనియన్‌ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు స్థానిక మండల పరిషత్‌ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీఓ తులసీరామ్‌కు వినతిపత్రం అందజేశారు. బానోత్‌ ధన్వంతరావు, తంబర్ల లక్ష్మి, ఈరు, శీరంశెట్టి వినోద్‌, వీర్యా పాల్గొన్నారు.

ఇల్లెందు: సులభ్‌ కాంప్లెక్స్‌ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ నేతలు యాకూబ్‌షావలీ, రఘు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ... సులభ్‌ ఇంటర్నేషనల్‌ ఆర్గనైజేషన్‌ పేరుతో 30 ఏళ్లు టెండర్‌ ఇచ్చారని, మార్చితో టెండర్‌ గడువు ముగిసిందని, మరో మూడేళ్లు టెండర్‌ను పొడిగించినట్లు తెలిపారు. దీనివల్ల జీతాలు పెండింగ్‌లో పడ్డాయని తెలిపారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగాల పేరుతో సొదా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ నియామకాల పక్రియను నిలిపివేయాలని సింగరేణి కాంట్రాక్ట్‌ జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని డీవైజీఎం పర్సనల్‌ జి.వెంకట మోహన్‌రావుకు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్‌.సంజీవ్‌, అల్బర్ట్‌, కృష్ణప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ‘ఇందిరమ్మ’ ఇళ్లు

- వెంటాడుతున్న సాంకేతిక సమస్య
- ఫొటోలు అప్‌లోడ్‌ కాక అందని బిల్లులు
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు



బేస్‌మెంట్‌ లెవల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ఇల్లెందురూరల్‌: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నియోజకవర్గంలో మండలంలోని పూబెల్లి గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేశారు. గ్రామంలో గుడిసెలో నివసిస్తున్న ప్రతీ కుటుంబానికి ఇంటిని మంజూరు చేయడంతో గ్రామస్తులు సంబురపడిపోయారు. ఈ అవకాశం మళ్లీ మళ్లీ రాదని ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు. కానీ బిల్లులు మంజూరు కాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తొలి విడత సాఫీగా మంజూరు...

పూబెల్లి గ్రామంలో మొత్తం 84 కుటుంబాలకు ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్లు మంజూరు చేశారు. శంకుస్థాపన సమయంలో నిర్మాణం కోసం ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని అమాత్యులు, కలెక్టర్‌, స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. అయినా ఆర్థికంగా ఇబ్బంది పడుతూనే ఇసుకను అధిక ధరలకు కొనుగోలు చేశారు. గత నెలలో బేస్‌మెంట్‌ లెవల్‌కు చేరుకున్న 35 ఇళ్లకు బిల్లులు మంజూరు చేశారు.

వర్షాలు కురుస్తుండటంతో..


తొలకరి జల్లులు కురవడంతో వ్యవసాయ పనులు ప్రారంభించిన స్థానికులు ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి అవాంతరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒకవైపు నిర్మాణాలలో వేగం కొనసాగిస్తూ చేలల్లో దుక్కులు సిద్ధం చేసుకోవడం, విత్తనాలు విత్తుకోవడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ప్రస్తుతం 15 ఇళ్లు స్లాబ్‌ లెవల్‌కు చేరుకున్నాయి. మరో 12 బేస్‌మెంట్‌ లెవల్‌కు చేరుకున్నాయి. స్లాబ్‌ లెవల్‌కు చేరుకున్న ఇళ్లకు రెండో విడతగా రూ.1.25 లక్షలు, బేస్‌మెంట్‌ లెవల్‌ ఇళ్లకు రూ.లక్ష చొప్పున బిల్లులు అందాల్సి ఉంది.

వెంటాడుతున్న సాంకేతిక సమస్య...

పూబెల్లి గ్రామంలో సెల్‌ సిగ్నల్స్‌ సక్రమంగా లేకపోవడంతో ఇంటి నిర్మాణాలను ఆఫ్‌లైన్‌లో చిత్రీకరించి సిగ్నల్‌లోకి వచ్చిన తరువాత తిరిగి నిర్దేశిత ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది. కానీ నిర్దేశిత నిర్మాణ దశలకు చేరుకున్న లబ్ధిదారులు హౌసింగ్‌ ఏఈ, గ్రామపంచాయతీ కార్యదర్శి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. తమ ఇళ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలని వేడుకుంటున్నారు. కానీ సాంకేతిక సమస్య ఉందని, ఇంకా పక్షం రోజులు ఆగాలని సెలవిస్తున్నారు.

సాగు వేళ ఆర్థిక ఇబ్బందులతో..

ప్రస్తుతం వానాకాలం సాగు సీజన్‌ ప్రారంభం కావడంతో వ్యవసాయ పెట్టుబడులు గ్రామీణ ప్రాంత ప్రజలకు భారంగా ఉంటాయి. ఇటువంటి సమయంలో చేతిలో ఉన్న డబ్బులను ఇళ్ల నిర్మాణానికి వెచ్చించారు. ఆయా నిర్మాణాలు నిర్దేశిత దశకు చేరుకున్నా బిల్లులు మంజూరులో జాప్యం చోటుచేసుకోవడం పూబెల్లి వాసులను ఆర్థికంగా ఇబ్బంది పెడుతోంది. దీంతో చేతిలో చిల్లి గవ్వలేక అటు ఇంటి నిర్మాణం ముందుకు సాగక.. ఇటు వ్యవసాయ పనుల చేయలేక రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణం ఆలస్యమైనా వ్యవసాయానికి పెట్టుబడి ఎట్లా అంటూ రైతులు తలలు పట్టుకుంటున్నారు. కొంతమంది ప్రైవేటు వ్యాపారుల వద్ద అరువు తెచ్చుకుండగా... మరికొందరు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.



స్లాబ్‌ లెవల్‌కు చేరుకున్న ఇల్లు

సాంకేతిక సమస్య అంటున్నారు..



ఇందిరమ్మ పథకంలో కలల గూడు నిర్మించుకోవాలని ఆశించాం. నిర్మాణం వెంటనే ప్రారంభించాం. బేస్‌మెంట్‌ పూర్తవగానే బిల్లులు మంజూరు చేశారు. ప్రస్తుతం స్లాబ్‌ లెవల్‌ వరకు పూర్తి చేశాం. బిల్లులు మంజూరుకు సాంకేతిక సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు.

– మూతి చంటి, పూబెల్లి

చేతిలో చిల్లిగవ్వ లేదు..



ఇంటి నిర్మాణం వేగవంతంగా చేపట్టేందుకు అవసరమైన సామగ్రిని ముందస్తుగానే కొనుగోలు చేశాను. ప్రస్తుతం ఇంటి నిర్మాణం బేస్‌మెంట్‌ వరకు చేరుకుంది. బిల్లు మంజూరు కోసం అధికారులను అడిగితే పక్షం రోజులు ఆగాలని చెబుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు.

– చీమల శివ, పూబెల్లి

సమస్య పరిష్కరిస్తాం..



పూబెల్లి గ్రామంలో ఇంటర్‌నెట్‌ సిగ్నల్‌ సమస్య ఉంది. బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సాంకేతిక సమస్య ఉత్పన్న కావడం వల్ల పూబెల్లి గ్రామంలో మాత్రమే ఫొటోలు అప్‌లోడ్‌ కావడం లేదు. త్వరలోనే పరిష్కరించి లబ్ధిదారులకు బిల్లులు అందేలా చూస్తాం.

– జి.శంకర్‌, జిల్లా హౌసింగ్‌ పీడీ

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న బ్రహ్మాచారి

సుజాతనగర్‌: లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్‌ కోడ్‌లను అమలు చేయడం ద్వారా ప్రభుత్వం పని గంటలను పెంచుతోందని, తద్వారా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతారని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పనివిధానం లేబర్‌ కోడ్‌ల మూలంగా ఉనికి కోల్పోయే అవకాశం ఉందన్నారు. కార్పొరేట్‌ కంపెనీలు, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి చేస్తోందని విమర్శించారు. లేబర్‌ కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సమ్మెలను జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నర్రా శివ రామకృష్ణ, వీర్ల రమేష్‌, జగన్‌, శ్రీనివాసరావు, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు..

జూలూరుపాడు: మద్యం సేవించి వాహనాలు నడపరాదని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో చంద్రుగొండ క్రాస్‌ రోడ్‌లో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు చేశారు.

సీఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించడం వలన రోడ్డు ప్రమాదాలు జరగడంతోపాటు మృత్యువాతన పడటం జరుగుతోందన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ రాజేశ్వరరావు, కానిస్టేబుళ్లు వెంకట్‌, కోటేశ్వరరావు, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

టేకులపల్లి: ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్‌, ఎస్‌ఐ ఎ.రాజేందర్‌ హెచ్చరించారు.

ఈ మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి టేకులపల్లి పోలీసు స్టేషన్‌ సమీపంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని కోరారు.

మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక



ర్యాలీ నిర్వహిస్తున్న శానిటేషన్‌ సిబ్బంది

ఇల్లెందు: పట్టణంలో ప్రతీ షాపు ఎదుట ఓ బుట్ట ఏర్పాటు చేసుకోవాలని, ఆ బుట్టలోనే చెత్త వేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు చైతన్యం కల్పించాలని ఇల్లెందు స్వచ్ఛ భారత్‌ అంబాసిడర్‌ సతీష్‌ఖండేవాల్‌ అన్నారు. మంగళవారం ఇల్లెందు మెయిన్‌రోడ్‌ హైస్కూల్‌ ఎదురుగా మున్సిపల్‌ కాంప్లెక్సులో ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో చెత్త రోడ్ల మీద ఉండటం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని అక్కడి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, చెత్తను బుట్టల్లో వేసేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ లాల్యా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలి

పాల్వంచ: కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా ఆర్గనైజింగ్‌ కార్యదర్శి వి.అజిత్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం స్థానిక ఎంఈఓ శ్రీరామ్మూర్తికి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ... విద్యాసంవత్సరం పునఃప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ అందించాలన్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. గుండాల సృజన్‌, వెంకటేష్‌, చందూలాల్‌, రాజు పాల్గొన్నారు.

20న బహిరంగ వేలంపాట

పాల్వంచరూరల్‌: పెద్దమ్మతల్లి ఆలయంలో టెండర్‌ కం బహిరంగ వేలంపాటలను ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్‌.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఏసీ ఫంక్షన్‌ హాళ్లు, నూతన కాంప్లెక్స్‌లోని షాపులు, పాత క్లాంపెక్స్‌లోని 4 నంబరు దుకాణానికి, తలనీలాలు, చీరలు పోగు చేసుకునేందుకు, పూల దండలు విక్రయించు కునేందుకు, శివాలయంలోని కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలకు రేపు పోటీలు

కొత్తగూడెంఅర్బన్‌: హకీంపేట స్పోర్ట్స్‌ స్కూల్‌ అడ్మిషన్లకై కొత్తగూడెం మండలంలోని పాఠశాలలోని హెచ్‌ఎంలు, పీడీ, పీఈటీలతో మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ ప్రభుదయాళ్‌ సమావేశం నిర్వహించారు. ఎంపికకై చేపట్టవలసిన అంశాల గురించి వివరించారు. ఈనెల 19న శ్రీ రామచంద్ర స్కూల్‌ గ్రౌండ్‌లో ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

‘కోర్టు ఆదేశించినా దక్కని న్యాయం..’

ఇల్లెందు: ఆర్‌సీఎం చర్చి సమాధుల స్థలం ఆక్రమణ కోర్టు మెట్లు ఎక్కింది. పూర్వికుల సమాధులు కూల్చి భూ కబ్జా చేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని ఆర్‌సీఎం సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాట్లాడుతూ.. రంజాన్‌ పండుగ రోజున కొంతమంది ఈ భూమి తమదే అంటూ జేసీబీలు పెట్టి 50 ఏళ్ల చరిత్ర కలిగిన 250 సమాధులను కూల్చివేశారని తెలిపారు. ఈ క్రమంలో తాము కోర్టును ఆశ్రయించగా మాకే అనుకూలంగా తీర్పు వచ్చినట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌, రెవెన్యూ అధికారులు సదరు భూమిని తమకు అప్పగించకుండా ఎమ్మెల్యే అనుచరులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో గుండమళ్ల పుష్పరాజ్‌, కందిమళ్ల జాన్‌, క్లింట్‌ రోచ్‌, బాలస్వామి, ప్రకాష్‌, ముత్తయ్య, స్వరూప, రోజా, లక్ష్మి, సుశీల, జాన్సీ, రేఖ, అగ్నేష్‌, మరియమ్మ, హేమ, మేరీ, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



టేకులపల్లి: కోక్యాతండాలో మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

టేకులపల్లి: పేదల సంక్షేమం, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కోక్యాతండా తండా గ్రామంలో మోదీ 11సంవత్సరాల పాలనలో భాగంగా ప్రజా సంకల్ప సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ పార్టీకి పదేళ్లు అధికారం ఇస్తే కేసీఆర్‌ కుటుంబం మాత్రమే బాగుపడిందని, ఇప్పుడు కాంగ్రెస్‌ పార్టీకి అధికారం ఇస్తే కేసీఆర్‌ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలిస్తున్నారని విమర్శించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రజల కష్టాలు, ఇందిరమ్మ ఇళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేజావత్‌ శంభునాయక్‌, రాపాక రమేష్‌, బాలాజీ నాయక్‌, అజ్మీరా సూర్య నాయక్‌, మంగ్యా, సత్యం, నాగేందర్‌ పాల్గొన్నారు.

జూలూరుపాడు: బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం పడమటనర్సాపురం గ్రామంలో వికసిత్‌ భారత్‌ సంకల్ప సభ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్‌ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారన్నారు. నిమ్మటూరి రామారావు, గుగులోత్‌ రాంబాబు, గుగులోత్‌ బాబులాల్‌, భూక్యా చరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు కోసం ఉద్యమించాలి



యూనియన్‌లో చేరుతున్న ఆటోడ్రైవర్లు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): రవాణారంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం కేంద్రంపై ఉద్యమించాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. శేషగిరిభవన్‌లో బుధవారం జరిగిన యూనియన్‌ జనరల్‌బాడీ సమావేశంలో పట్టణంలోని పలు అడ్డాలకు చెందిన 30 మంది ఆటోడ్రైవర్లు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలోని ఉచిత బస్సు సౌకర్యంతో రాష్ట్ర వ్యాపితంగా ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆటో కార్మికులకు ఈ చలాన్ల నుంచి మినహాయింపు ఇవ్వాలని, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జి.నగేష్‌, బత్తుల సత్యనారాయణ, మర్రి కృష్ణ, అఫ్జల్‌పాషా, ఆరెల్లి శ్రీను, బాబుజానీ, లక్ష్మణ్‌, రామ్మూర్తి, సమ్మయ్య, రవి, రమేష్‌, వెంకటేష్‌, ప్రసాద్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన



టేకులపల్లి: ఏకలవ్య పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

టేకులపల్లి: సులానగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుష్‌ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఏకలవ్య మోడల్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌లో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్‌ వైద్యాధికారి జి.విజయ విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను తెలియజేసి, యోగాసనాలు వేయించారు. మాట్లాడుతూ.. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, జీవనక్రియలను మెరుగుపరిచి రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ నిశాంత్‌ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పాపకొల్లు, జూలూరుపాడు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామచంద్ర మిషన్‌ హార్ట్‌ ఫుల్‌నెస్‌ యోగా మహోత్సవం జూలూరుపాడు మండల ఇన్‌చార్జ్‌ బానోత్‌ నవీన్‌ రాథోడ్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు యోగా ట్రైనర్‌ మాధురి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, ఎస్కే మీరా సాహెబ్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

టేకులపల్లి: అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం బొమ్మనపల్లి సెక్టార్‌ దంతెలతండాలో జరిగిన కార్యక్రమంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. బోడు, సులానగర్‌, బొమ్మనపల్లి, గంగారం సెక్టార్లలోనూ ముమ్మరంగా సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లులు, గర్భిణులకు లభించే పోషకాహారం, కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శించారు. సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమాలు, ఆరోగ్య విద్య, ప్రీస్కూల్‌ ప్రణాళిక గురించి తల్లులకు అవగాహన కల్పించారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకుంటామని, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గవర్నమెంట్‌ స్కూల్‌లో చేర్పిస్తామని తెలిపారు. సూపర్‌వైజర్లు అనురాధ, ఖలీదా, లక్ష్మి, యశోదమ్మ, నిర్మల పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్‌: అమ్మమాట.. అంగన్‌వాడీ బాట.. కార్యక్రమంలో భాగంగా మామిడిగుండాల గ్రామ అంగన్‌వాడీ పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాల అంగన్‌వాడీ పాఠశాలల చిన్నారులను ఒకచోటకు చేర్చి అక్షరాలు దిద్దించారు. ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ కొమురమ్మ మాట్లాడుతూ.. ఆటపాటలతో పిల్లలకు అక్షరాలు నేర్పుతూ.. ఆరోగ్యం పట్ల తల్లిదండ్రుల బాధ్యతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింతలకు పోషకాహారం, రక్తహీనత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, కృష్ణవేణి, ఉమ, వీరభద్రమ్మ, మంగ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

- డ్రెయినేజీలు లేవు.. మురుగు కదలదు
- పాండురంగాపురం, తవిశలగూడెం గ్రామ వీధుల్లో దుర్గంధం



పాండురంగాపురంలో ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగు



రెడ్డిగూడెం వెళ్లే వీధిలో ప్రవహిస్తున్న మురుగు నీరు

పాల్వంచరూరల్‌: పాండురంగాపురం, తవిశలగూడెం గ్రామాల్లో డ్రెయినేజీలు లేక మురుగు కదలక వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో ప్రజలకు అనారోగ్యం బారిన పడుతున్నారు. గ్రామాల్లో ఇళ్లల్లోని మురుగు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పారిశుద్ధ్య లోపం వేధిస్తోంది. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ మురుగు పేరుకపోయి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగల బెడదతో వానాకాలంలో రోగాల బారిన పడే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు పంచాయతీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేదు..

గ్రామంలో ప్రధాన రహదారి వెంట పాండురంగాపురం పంచాయతీ ఒకవైపు, తవిశలగూడెం పంచాయతీ ఇంకోవైపు, పాండురంగాపురం తండా పంచాయతీ మరోవైపు ఉన్నాయి. ఒకవైపు పాండురంగాపురం తండా పంచాయతీ వైపు బాక్స్‌ డ్రెయినేజీ నిర్మాణం చేశారు. పాండురంగాపురం, తవిశలగూడెం పంచాయతీల పరిధిలో డ్రెయినేజీలు నిర్మాణం చేయలేదు. దీంతో గ్రామం ప్రారంభం నుంచి రెడ్డిగూడెం వైపు వెళ్లే రోడ్డు ప్రధాన రహదారిపై మురుగు నీరు వీధిలో నిలిచిపోతుంది. దీంతో ఈ మార్గంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది.


శుభ్రం చేసే దిక్కు లేదు...

డ్రెయినేజీ కాలువలు నిర్మాణం చేయడం లేదు సరే.. కనీసం రోడ్డు ఇరువైపుల కాలువలో సిల్ట్‌ను తొలిగించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మురుగు దుర్వాసనతో, దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎస్‌ఆర్‌ నిధులతో సమస్యకు పరిష్కారం...

కేటీపీఎస్‌ బూడిద కాలుష్య ప్రభావిత ప్రాంతంలో ఉన్న పాండురంగాపురం గ్రామానికి ప్రతీ సంవత్సరం జెన్కో యాజమాన్యం ద్వారా సీఎస్‌ఆర్‌ పాలసీ ద్వారా నిధులు మంజూరు చేస్తుంది. ఆ నిధులను అధికారులు స్థానిక గ్రామాభివృద్ధికి వినియోగిస్తే డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. అయితే ఈ నిధులను ఎక్కడ ఖర్చు చేస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రెయినేజీల అభివృద్ధికి నిధులను ఖర్చు చేయాలని కోరుతున్నారు.


దుర్వాసన భరించ లేకపోతున్నాం..



ప్రధాన వీధిలో ఇళ్ల సమీపంలో మురుగు నిలుస్తోంది. దీనికి తోడు వర్షం కురిసినప్పుడు నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. వారం, పదిరోజులు అలానే ఉంటుంది. కనీసం కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది.

– ఆర్‌.వెంకటేశ్వర్లు, పాండురంగాపురం


డ్రెయినేజీలు నిర్మించాలి..



వర్షాకాలం, వేసవికాలంలో ప్రధాన రహదారి పక్కనున్న ఇళ్లలో నుంచి వచ్చే మురుగు ఎక్కడి అక్కడే నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సీఎస్‌ఆర్‌ నిధులు ఉపయోగించి ప్రధాన మార్గంలో బాక్స్‌ డ్రెయినేజీ నిర్మించాలి.

– హనుమంతరావు, పాండురంగాపురం

ప్రతిపాదనలు పంపుతాం..



రెండు గ్రామపంచాయతీల పరిధిలోని ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు కాగానే డ్రెయినేజీలు నిర్మాణం చేసి ప్రజలకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ